'ప్రతిభ ఏ ఒక్కరి సొత్తు కాదు'


పురస్కారాలను అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రతి ఒక్కరిలోనూ ప్రతిభ దాగి ఉంటుందని నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ, తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో శ్రీ వాసవీ కన్యక పరమేశ్వరీ ఆర్ట్స్ డెవలప్‌మెంట్ సొసైటీ, లక్ష్మీనరసింహస్వామి ఆర్ట్స్ సొసైటీల ఆధ్వర్యంలో భక్తి గీతాలాపన, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిభ అనేది ఒక్కసి సొత్తు కాదని ఆయా రంగాల్లో ప్రతిభ కలిగిన వారికి వారి సత్తాను చాటుకునేలా అవకాశం రావడం ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న పలువురి ప్రముఖులకు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు నర్సారెడ్డి, ఐవీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.చంద్రశేఖర్, అనూష, డాక్టర్ శశాంక్, సంస్థ ప్రతినిధులు అపర్ణ, దీపికా, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

'పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల సేవలు వెలకట్టలేనివి'


పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులతో సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్

గోల్కొండ: పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల సేవలు వెలకట్టలేనివని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్ అన్నారు. గోల్కొండ కోట జగదాంబిక మహంకాళి అమ్మవార్ల బోనాలు విజయవంతంగా ముగిసిన సందర్భంగా ఆయన కోటలో పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులను సన్మానించారు. డీసీపీ మాట్లాడుతూ.. నగరంలో పోలీసులకు, మైత్రి కమిటీలకు మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. స్థానిక పండగలు, ఉత్సవాల నిర్వహణలో సైతం పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు పోలీసులకు తగిన సలహాలు ఇస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన అదనపు డీసీపీ మహ్మద్ అశ్వాక్‌తో కలిసి పీస్ అండ్ మైత్రి కమిటీ చైర్మన్ రాజువస్తాద్‌తో పాటు కమిటీ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సౌత్ వెస్ట్ జోన్ డీసీపీలు సయ్యద్ ఫయాజ్, కిషన్, మహ్మద్ మునావర్, వెంకట్‌రెడ్డి, గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు, పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు ఎస్.రాజువస్తాద్, ఆబీద్, షానవాజ్‌ఖాన్ తదితరులున్నారు.

'ప్రజాపాలన' కోసం క్యూ

బహదూర్‌పురా: జీహెచ్‌ఎంసీ అధికారులు కిషన్ బాగ్ పార్కులో ఏర్పాటు చేస్తున్న ప్రజాపాలన దరఖాస్తులు ఇచ్చేందుకు ప్రజలు సోమవారం పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ ప్రజా పాలనలో రూ.500 గ్యాస్ సిలిండర్‌తో పాటు 200 లోపు యూనిట్లకు ఉచిత విద్యుత్ సరఫరా దరఖాస్తులను స్వీకరిస్తూ సిస్టంలో అప్‌లోడ్ చేస్తున్నామని జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు. రోజుకు 500 నుంచి 800 వరకు దరఖాస్తులు వస్తున్నాయన్నారు.


ప్రజా పరిపాలన దరఖాస్తులను అందజేయడానికి వచ్చిన లబ్ధిదారులు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి


జీఎంకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆలె భాగ్యలక్ష్మి

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని పలు బస్తీల్లో నెల కొన్న మురుగునీరు, తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి అన్నారు. ఈ మేరకు ఆమె జలమండలి జీఎం సంతోష్ కుమార్‌ను సోమవారం కలిసి స్థానిక సమస్యలను విన్నవించారు. అంబికానగర్, హనుమాన్‌నగర్, పటేల్‌నగర్, హరిజన బస్తీ, బాలాగంజ్ తదితర బస్తీల్లో దశాబ్దాల క్రితం వేసిన పైప్‌లైన్లనే ఇప్పటికీ కొనసాగిస్తుండడంతో, పెరిగిన జనాభాకు సరిపోలేని పరిస్థితి నెలకొందన్నారు. తాగునీటి సమస్యతో కూడా ప్రజలకు అవస్థలు తప్పడం లేదని వివరించారు. వెంటనే పైప్‌లైన్లను ఆధునీకరించాలని కోరారు.

నిజాం కళాశాల విద్యార్థినుల ఆందోళన



గన్‌ఫౌండ్రీ: వసతి గృహం కేటాయించాలని కోరుతూ నిజాం కళాశాల విద్యార్థినులు కదం తొక్కారు. కొన్ని రోజులుగా నిరసనలు చేస్తున్నప్పటికీ ప్రిన్సిపాల్ మొండి వైఖరిని ప్రదర్శించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు హాస్టల్‌ను కేటాయించాలని కోరుతూ సోమవారం నిజాం కళాశాల నుంచి బషీర్‌బాగ్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ..నిజాం కళాశాల యూజీ విద్యార్థులకు హాస్టల్ కావాలని ఆందోళనలు చేయగా గత ప్రభుత్వం డిగ్రీ విద్యార్థినుల కోసం హాస్టల్‌ను కట్టించినట్లు గుర్తుచేశారు. కానీ నేడు ఆ హాస్టల్‌ను పీజీ విద్యార్థినులకు కేటాయిస్తూ యూజీ విద్యార్థినులకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బషీర్‌బాగ్ నుంచి అబిడ్స్ వెళ్లే రహదారిపై నిరసన తెలుపుతున్న విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, విద్యార్థులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆందోళన చేస్తున్న విద్యార్థినులను పోలీసులు వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

తెలంగాణ రాష్ట్రం.. సకల కళల సమ్మేళనం


కార్యక్రమంలో పాల్గొన్న మామిడి హరికృష్ణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్రం సకల కళల సమ్మేళనమని భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో శ్రీరాగరమ్య కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ముత్యాల జల్లు కురిసే పేరిటి సంగీత నృత్య సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం పలువురు సంగీత నాట్య గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, రచయితలు ఆర్.విశ్వేశ్వర్‌రావు, శంకర నారాయణ, సంస్థ అధ్యక్షురాలు రమ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

గౌలిపురా: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని భవానీనగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి అన్నారు. అక్బర్ నగర్‌లోని మైనార్టీ పాఠశాలలో సోమవారం ఆయన మాదక ద్రవ్యాలు, ఆన్‌లైన్ యాప్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సైబర్ నేరాల పట్ల అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా నేరాల నివారణ కోసం బస్తీల వారీగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ బాలస్వామి

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అబిడ్స్: పూర్వ విద్యార్థుల సమ్మేళనం జోష్‌గా నిర్వహించారు. కుల్సుంపురా ప్రభుత్వ పాఠశాలకు చెందిన 1982 నుంచి 1992 వరకు 10వ తరగతి పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థులంతా సందడిగా సమ్మేళనం చేశారు. చిల్కూర్‌లో జరిగిన ఈ సమ్మేళనంలో, వివిధ రంగాల్లో వివిధ హోదాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు తమ పాతకాలం నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పాటలు పాడుతూ ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల రిటైర్డ్ ఉపాధ్యాయులు కుమారస్వామి, ఎస్.రవీంద్ర, పీటీ నర్సింహ, డి.ధనలక్ష్మి, నక్కా మల్లికార్జున్, నాగరాజు, హైమావతి, నాగేష్, ధర్మేందర్, సంతోష్, అరుణ, శోభా తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన చెట్లతో గోల్కొండ పాత పోలీస్ క్వార్టర్స్



పాత పోలీస్ క్వార్టర్స్ గ్రౌండ్‌లో ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేసిన కార్లు



నిరుపయోగంగా పోలీస్ క్వార్టర్స్

- రెండు దశాబ్దాలకు పైగా ఖాళీగానే..
- మరమ్మతులకు నోచుకోని వైనం
- గోల్కొండ పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు ఇక్కడే..

గోల్కొండ: కోట్లాది రూపాయల విలువ గల పోలీస్ క్వార్టర్స్ నిరుపయోగంగా మారింది. గోల్కొండ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఈ క్వార్టర్స్ దశాబ్దాల క్రితం నిర్మించారు. రెండు దశాబ్దాలకు పైగా ఇవి ఖాళీగానే ఉంటున్నాయి. గతంలో కొందరూ భవనాల శిథిలాలను గుట్టుచప్పుడు కాకుండా ఖాళీగా ఉన్న ప్రదేశంలో వేశారు. మరోవైపు ఈ స్థలంలోనే ఏపుగా పెరిగిన చెట్లు ఉన్నాయి. దీంతో ఈ క్వార్టర్స్ బూత్ బంగ్లాను తలపిస్తున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పాత పోలీస్‌స్టేషన్‌ను కూల్చివేసి కొత్త భవనాన్ని నిర్మించారు. ఆ సమయంలో పాత పోలీస్ క్వార్టర్స్‌లో ఒక దానికి మరమ్మతులు చేసి అందులోనే పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం కొత్త భవనంలో గోల్కొండ పోలీస్‌స్టేషన్ ఉంది. మరోవైపు పాత పోలీస్‌స్టేషన్ క్వార్టర్స్‌లో ఒకదానిలో టోలిచౌకీ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా పాత పోలీస్ క్వార్టర్స్ చుట్టూ చెత్త కుప్పలు పేరుకుపోయాయి. పలు చోట్ల దుర్గంధం వస్తుంది. పలు నిర్మాణుష్యమైన క్వార్టర్స్ కుక్కలకు నివాసంగా మారాయి. ఇదిలా ఉండగా పోలీస్ క్వార్టర్స్ మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో గతంలో స్థానిక యువకులు వాలీబాల్, బ్యాడ్మింటన్ ఆడేవారు. ప్రస్తుతం ఆ ఖాళీ ప్రదేశంలో టోలీచౌకీ ట్రాఫిక్ పోలీసులు, గోల్కొండ పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు నిలిచి ఉంటున్నాయి. అవి సైతం పూర్తిగా తుప్పు పట్టి ఉన్నాయి.

కొత్తవి నిర్మించరా..?

సుమారు 20 వరకు ఈ క్వార్టర్స్‌ను పూర్తిగా కూల్చివేసి పోలీసుల కోసం కొత్తవి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. సాధ్యం కాకపోతే విశాలమైన స్థలంలో డబుల్ బెడ్‌రూమ్‌లు నిర్మించి వాటి కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. అయితే ఈ క్వార్టర్స్‌లో కనీస సౌకర్యాలు లేకపోవడం వల్లనే పోలీసులు ఎవరూ వీటిలో ఉండడానికి ఇష్టపడడం లేదని తెలుస్తోంది. ఎప్పుడో నిర్మించిన ఈ క్వార్టర్స్ ఎప్పుడు కూలుతాయో అనే భయంతో కొందరు ఇక్కడ ఉండడానికి ధైర్యం చేయడం లేదు. క్వార్టర్స్‌లో కొందరు హోంగార్డ్స్ అనాధికారికంగా ఉంటున్నారు. కొన్ని నెలల క్రితం ఓ పాత పోలీస్ క్వార్టర్స్‌ను కూల్చివేసి అక్కడ టోలిచౌకీ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కోసం కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. మిగతా వాటిని కూడా కూల్చివేసి కనీసం పోలీసులకు కొత్తవి కట్టిస్తే బాగుంటుందని పలువురు అంటున్నారు.

నేడు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన

యాకుత్‌పురా: బోనాల ఉత్సవాల్లో భాగంగా హరిబౌలి గజానన వ్యాయామశాల మాతేశ్వరి పోచమ్మ, మహంకాళి ఆలయంలో మంగళవారం సాముహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 5వారాల పాటు నిర్వహించే కుంకుమార్చన చివరి వారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే కుంకుమార్చనలో మహిళలు పాల్గొన్నాలని కోరారు.

'తెలుగు యూనివర్సిటీ పేరు మార్చితే సహించేది లేదు'


బోనాల శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్: పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పేరు మార్చితే సహించేది లేదని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మహారాజ్ గంజ్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..తెలుగు ప్రజల కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదన్నారు. దానికి గుర్తుగా తెలుగు యూనివర్సిటీకి పెట్టిన ఆయన పేరు తొలగించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాలిక కిడ్నాప్ కేసులో పోలీస్ కస్టడికి కిడ్నాపర్

అబిడ్స్: అబిడ్స్ కట్టెలమండిలో బాలిక కిడ్నాప్ కేసులో కిడ్నాపర్‌ను పోలీస్ కస్టడికి తీసుకునేందుకు అబిడ్స్ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వారం రోజుల పాటు నిందితుడిని పోలీసు కస్టడికి తీసుకుని పోలీసులు కేసును పూర్తిగా విచారించనున్నారు. అబిడ్స్ కట్టెలమండిలో ఆరేళ్ల బాలికను కిడ్నాప్ చేసిన బిహార్‌కు చెందిన కిడ్నాపర్ మహ్మద్ బిలాల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం విధితమే. నిందితుడిపై పోక్సో, అత్యాచార యత్నం, దొంగతనం, కిడ్నాపింగ్‌లపై నాలుగు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని అబిడ్స్ ఏసీపీ, ఎ.చంద్రశేఖర్ తెలిపారు.

కిడ్నాప్ జరిగిన తరహాను సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తామన్నారు. బాలికను నడుచుకుంటూ తీసుకువెళ్తూ ఆటోలో ఎక్కించిన దృశ్యాలను, అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో ఆటో నుంచి బస్సు ఎక్కిన దృశ్యాన్ని, కొత్తూరు ప్రాంతంలో బాలికను బస్సు నుంచి మహ్మద్ బిలాల్ తన ఇంటికి తీసుకువెళ్లిన దృశ్యాలను సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసి పూర్తి వివరాలు సేకరిస్తామని ఏసీపీ ఎ.చంద్రశేఖర్ వివరించారు. బాలిక చెవులకు ఉన్న బంగారు కమ్మలను నిందితుడి వద్ద స్వాధీనపరచుకున్నామన్నారు. బాలిక తల్లిదండ్రులకు ఫోన్‌చేసి డబ్బులు డిమాండ్ చేసేందుకే మహ్మద్ బిలాల్, బాలికను కిడ్నాపర్ చేశారని ఆయన వివరించారు. కిడ్నాప్‌ను ఛేదించడంలో విజయవంతమైన అబిడ్స్ పోలీసులతో పాటు ఏసీపీ చంద్రశేఖర్, డీసీసీ అక్షాన్ష్ యాదవ్‌లను కట్టెలమండి బస్తీవాసులు ఘనంగా సత్కరించారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి


నిజాం కాలనీలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేస్తేనే ప్రజలకు ప్రయోజనం ఉంటుందని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని నిజాంకాలనీ, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన నిజాం కాలనీలో జరుగుతున్న డ్రైనేజీ పనులను, రోడ్డు కట్టింగ్ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన స్థానికులతో మాట్లాడుతూ.. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పనులు సకాలంలో పూర్తి చేయాల్సిందిగా వివిధ శాఖల అధికారులను కోరామన్నారు. నిజాం కాలనీ నుంచి టోలిచౌకి మీదుగా బాల్‌రెడ్డినగర్, రియాసత్‌నగర్ మీదుగా వేస్తున్న బాక్స్ టైప్ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయన్నారు. త్వరలోనే డ్రైనేజీ వరద నీటి పనులు కూడా పూర్తవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, బల్దియా అధికారులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలి


పురస్కార గ్రహీతలతో విద్యాశంకర భారతి, రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తల్లిదండ్రులు, గురువులను గౌరవించడం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పుష్పగిరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ అభినోద్దండ విద్యాశంకర భారతి అన్నారు. కానీ ప్రస్తుత సమాజంలో అది కొరవడిందని ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం రవీంద్రభారతిలో తిరుమల చారిటబుల్ ట్రస్ట్, సాధన సాహితీ స్రవంతిల సంయుక్త ఆధ్వర్యంలో కేవీ.రాఘవాచార్యులు స్మారక పండిత పురస్కారాన్ని విశ్రాంత ప్రధానాచార్యులు శ్రీ రంగాచారి, కేవీ.రమణాచారి స్ఫూర్తి పురస్కారాన్ని బాష్యం శ్రవణ్‌కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు కేవీ.రమణాచారి గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, విశ్రాంత ఆచార్యులు కసిరెడ్డి వెంకటరెడ్డి, సాధన నర్సింహాచార్య పాల్గొన్నారు.

సేవ చేసే వారికి గుర్తింపు




గోల్కొండ: సేవ చేసే వారిని ప్రజలు గుర్తిస్తారని జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని వారి సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. గోల్కొండ కోట బోనాల సమయంలో జలమండలి వారు ఏర్పాటు చేసిన తాగునీటి క్యాంప్‌లో సేవలందించిన జలమండలి సిబ్బందిని ఆయన సన్మానించారు. సాయిబాబాచారి మాట్లాడుతూ..కోటలో ఏర్పాటు చేసిన ఉచిత తాగునీటి క్యాంప్ వేలాది మంది భక్తుల దాహాన్ని తీర్చిందన్నారు. జలమండలికి చెందిన నరేష్ తదితరులు చల్లని తాగునీరు అందించారన్నారు. శ్రీకాంత్‌చారి తదితరులున్నారు.

ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి


పూజల్లో నందకిశోర్ వ్యాస్, పప్పుమాత్రే

అబిడ్స్: ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు నందకిశోర్ వ్యాస్ పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాన్ని చాటే విధంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. శ్రావణ సోమవారం సందర్భంగా కాశిబుగ్గ ఆలయంలో నందకిశోర్ వ్యాస్, ఆయన సతీమణి ఉమాదేవి వ్యాస్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నందకిశోర్ వ్యాస్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల పండగలను స్వయంగా చేపడుతుందన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమంలో, ప్రజా అభివృద్ధిలో ముందుందన్నారు. ఈ కార్యక్రమంలో పప్పుమాత్రే, సురేష్ జోగే తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో నలుగురి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

గౌలిపురా: దారి దోపిడీలకు పాల్పడుతున్న నలుగురు నిందితులను మొఘల్‌పురా పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. బాబానగర్‌కు చెందిన మహ్మద్ నవాజ్ (25), సయ్యద్ ఇమ్రాన్(29), మహ్మద్ తాజుద్దీన్(28), సయ్యద్ ఫయాజ్(28), హైపర్ ఒక ముఠాగా ఏర్పడి బస్టాప్‌లలో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు దోపిడీలు చేస్తుంటారు. ఈ క్రమంలోనే గత నెల 30న ఉదయం పంచ్‌మహల్లాలో బస్సు కోసం ఎదురు చూస్తున్న ఖమ్రుద్దీన్‌కు కత్తి చూపి నకిలీ ఆటో నంబర్‌లో వచ్చిన దుండగులు అతని వద్ద నుంచి మొబైల్ ఫోన్‌తో పాటు రూ.5 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలతో నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 11 మొబైల్ ఫోన్లు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు హైపర్ పరారీలో ఉన్నాడు.

ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న నాగ్ నాథ్ మాశెట్టి

చార్మినార్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా బోనాల ఉత్సవాలు కొనసాగుతాయని టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ నాగనాథ్ మాశెట్టి అన్నారు. సోమవారం డిగ్నిటీ హౌసింగ్ కాలనీ పిల్లిగూడలోని ముత్యాలమ్మ అమ్మవారికి సమర్పించిన మారు బోనం పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత నెల 7వ తేదీ నుంచి ఈనెల 4వ తేదీ వరకు ఆషాడ మాసం బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయన్నారు. ఇక శ్రావణ మాసంలో సైతం అమ్మవారికి స్థానిక భక్తులు బోనాలను సమర్పించనున్నారన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు



గోల్కొండ: గోల్కొండ బోనాల సందర్భంగా సోమవారం కోటపై వేదం ఆర్ట్స్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన చిన్నారులు నృత్యం చేస్తూ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా వేదం ఆర్ట్స్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన ప్రతిమ మాట్లాడుతూ..ప్రతియేటా తమ వద్ద నృత్యం నేర్చుకుంటున్న వారితో గోల్కొండ కోట బోనాల్లో అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కార్యక్రమాన్ని నిర్వహించి అమ్మవార్ల ఆశీర్వాదాలు పొందుతామన్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరాజు, అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు సాయిబాబాచారి చిన్నారులను సన్మానించారు.

'హనుమజ్జానకి రామ శర్మ' పురస్కారానికి రామచంద్ర ప్రసాద్ ఎంపిక


రామచంద్ర ప్రసాద్

సుల్తాన్‌బజార్: హనుమజ్జానకి రామ శర్మ స్మారకార్థం నెలకొల్పిన సాహిత్య పురస్కారానికి ఈ సంవత్సరం నెల్లూరుకు చెందిన ప్రముఖ పద్య కవి మెట్టు రామచంద్రప్రసాద్ ఎంపికయ్యారు. ఈనెల 16న నెల్లూరు టౌన్ హాల్‌లో జరిగే పోలూరి హనుమజ్జానకి రామ శర్మ శత జయంతి ఉత్సవంలో రామచంద్రప్రసాద్‌కు వెంకయ్య నాయుడు చేతుల మీదుగా రూ.25 వేల నగదు, జ్ఞాపిక, శాలువా, ప్రశంసా పత్రంతో సత్కరించనున్నట్లు పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచాలి


వికాస్ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న మీర్ ఫిరాసత్ అలీ బాక్రి

చార్మినార్: మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకొని మంగళవారం ఉదయం దారుషిఫా నుంచి గోల్కొండలోని హజ్రత్ అబ్బాస్ ఆషుర్‌ఖానా వరకు కాలినడకన వెళ్లనున్నామని..అనంతరం అక్కడి నుంచి తిరిగి పాతబస్తీ దారుషిఫాకు చేరుకోవడానికి ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచాలని రవాణా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజును కలిసి వినతిపత్రం అందజేశామని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రి తెలిపారు. తమ వినతి మేరకు వెంటనే స్పందించిన వికాస్ రాజ్ టీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసి మంగళవారం ఉదయం గోల్కొండ నుంచి దారుషిఫా వరకు బస్సులను అందుబాటులో ఉంచేటట్లు తగిన చర్యలు తీసుకున్నారన్నారు.

హిందూ సంస్కృతిని చాటేందుకు బజరంగ్‌సేనా కృషి


శివ మందిర్‌లో పూజలు చేస్తున్న ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు, రజని తదితరులు

అఫ్జల్‌గంజ్: హిందూ సంస్కృతిని చాటేందుకు బజరంగ్‌సేనా ఆధ్వర్యంలో నిరంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతామని రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక భావాలను ప్రజల్లో పెంపొందించడమే తమ బజరంగ్‌సేనా ముఖ్యోద్దేశమన్నారు. శ్రావణ మాస సోమవారం వేడుకలు శివమందిరం ఘనంగా చేశారు. ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ..ప్రతిరోజూ ప్రజల్లో భక్తీభావాలను పెంపొందించడం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం, హిందూ సంస్కృతిని అన్ని ప్రాంతాల్లో వ్యాప్తి చెందే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రజని, రమణ్‌దీప్‌రావు, సుశీల్ మహారాజ్, సాయినాథ్, దుర్గాశర్మ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం విజయవంతం చేద్దాం


మొక్కలు నాటి నీరు పోస్తున్న డీసీ సరిత

చార్మినార్: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ డిప్యూటీ కమిషనర్ సరిత సూచించారు. స్వచ్ఛదనం-పచ్చదనం సందర్భంగా సోమవారం చార్మినార్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి బస్తీలు, కాలనీ, వాణిజ్య సముదాయాలు, ఆర్టీసీ బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్స్, శ్మశాన వాటికలు, పార్కులో ప్లే గ్రౌండ్లలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.

ప్రేమానురాగాలు చూపించాలి



బహదూర్‌పురా: క్రైస్తవులంతా ఐక్యతను చూపిస్తూ సమస్యపై ఒక్కతాటిగా నిలిచి పోరాటాలు చేస్తూ ప్రేమానురాగాలు చూపించాలని హైదరాబాద్ న్యూ జెరూసలేం మినిస్ట్రీ బిషప్ ధన్‌రాజ్ కోట అన్నారు. ఫలక్‌నుమాలోని బిన్ ట్రిక్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆర్ట్ ఆఫ్ సర్వైవల్, సేవలకుల సన్మానం కార్యక్రమానికి ముఖ్య ప్రసంగీకులుగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి లివింగ్ హోప్ మినిస్ట్రీ ప్రెసిడెంట్ ఆనంద్ కుమార్ అధ్యక్షతన వహిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సియోను ఫెలోషిప్ చైర్మన్ రెవరెండ్ డాక్టర్ మోహన్ బాబు, హోలీ టెంపుల్ చర్చ్ రెవరెండ్ ప్రసాద్ చౌదరి, ఓల్డ్ సిటీ చర్చెస్ కన్వీనర్ చార్మినార్ డివిజన్ ప్రెసిడెంట్ బుర్రగల్ల ఆనందం పాల్గొన్నారు.